క్లుప్తంగా

ఉర్సులో ఎమ్మెల్యే ప్రార్థనలు



ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు: పట్టణ పరిధిలోని హజ్రత్ సయ్యద్ నిజాముద్దీన్ షహీద్ దర్గా ఉర్సులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బుధవారం ఆయన దర్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. హిందూ, ముస్లింతేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. ఉర్సు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, మత పెద్దలు లియాకత్ అలీ, వాజిద్ అలీ, హమీద్, అజ్మత్, ఇమ్రాన్, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్ చెక్కుల అందజేత



చెక్కును అందజేస్తున్న ఎంపీపీ మమత తదితరులు

రాయికోడ్(అందోల్): స్థానిక ఇందిర క్రాంతి భవనం సమావేశ మందిరంలో పలువురు లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఎంపీపీ మమత, సర్పంచ్‌లు కేదారినాథ్ పాటిల్, నర్సింలు, నరేశ్, సొసైటీ చైర్మన్ నాగిశెట్టి బుధవారం ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున ఆయా గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేసినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, సొసైటీ చైర్మన్ నాగిశెట్టి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, ఆర్ఐలు రామ్‌చందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం అధ్యక్షుడిగా మొహిద్‌పటేల్



మొహిద్‌పటేల్

నారాయణఖేడ్: నియోజకవర్గ పార్టీ ఎంఐఎం అధ్యక్షుడిగా ఖేడ్ పట్టణానికి చెందిన మొహిద్‌పటేల్ ఎన్నికయ్యారు. పట్టణంలోని కింగ్స్‌ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్వాన్ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా ఇన్‌చార్జి కౌసర్‌మొహియొద్దీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో మొహిద్‌ఖాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలోనే మండల కమిటీలు నియమించి పార్టీ పటిష్టతకు కృషిచేస్తానని మొహిద్ పటేల్ అన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని క్లస్టర్ ఏపీడీ రాజు సూచించారు. బుధవారం ఆయన కల్హేర్ మండల పరిషత్తులో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ పనులు తగ్గడంతో కూలీలకు పనులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సునీల్ బన్సల్‌ను కలిసిన జైపాల్‌రెడ్డి



సునీల్ బన్సల్‌ను కలిసిన జైపాల్‌రెడ్డి

జహీరాబాద్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌ను డీసీసీబీ మాజీ చైర్మన్, పార్టీ రాష్ట్ర నాయకుడు ఎం.జైపాల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. జైపాల్‌రెడ్డి జహీరాబాద్ పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు టికెట్‌ను ఆశిస్తున్నట్టు సమాచారం. అందులో భాగంగా జాతీయ నాయకులతో వరుసగా భేటీ అవుతూవస్తున్నారు.

యోగ తరగతులు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రమైన గుమ్మడిదల గ్రామంలో ఉచిత యోగ తరగతులను బుధవారం ప్రారంభించారు. వివేకానంద యోగ కేంద్రం ఆధ్వర్యంలో చేపడుతున్న తరగతులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

పశుపోషణ పెనుభారం

గ్రాసం లేక భారంగా గోవులు
- దాహార్తి తీర్చడానికి తంటాలు
- అమ్ముకొంటున్న దుస్థితి



ఎండుగడ్డి మేస్తున్న ఆవులు

కంగ్టి(నారాయణఖేడ్): పశువులను మేపుకొంటూ జీవనం సాగించే రాజస్థాని మార్వాడీ లంబాడాలుగా చెప్పుకొంటున్న గిరిపుత్రులకు అవి నేడు భారంగా మారాయి. వారు గుట్టలు, గుహలు, లోయలు, వంకలు ఉన్నచోట నివాసాలు ఏర్పర్చుకొని గోవులను పోషించుకుంటుంటారు. అయితే నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పశుగ్రాసం కరువైంది. దానికి తోడు గోవుల దాహం తీర్చడానికి నీళ్లు సైతం దొరకడం కష్టంగా మారింది. అందుకు కంగ్టి మండలంలోని బోర్గి సర్దార్ తండాను నిదర్శనంగా చెప్పవచ్చు. తండాలో గిరిజనులకు పదేళ్ల క్రితం సుమారు నాలుగు వేలకు పైగా ఆవులు ఉండేవి. కాని ఇప్పుడు వాటి సంఖ్య బాగా పడిపోయింది. పంట భూములు, బీడు భూముల్లో మేత లేక పశువులను అమ్ముకొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశు గ్రాసం కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి గోవుల ఆకలి తీర్చడానికి తిప్పలు పడుతున్నట్లు వాపోతున్నారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాల పంపిణీ



పశుగ్రాసం కొరతతో రైతులు, పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పశువులకు మేత కొరత తీర్చేందుకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు మంజూరు చేస్తోంది. ఈ ఏడు కూడా త్వరలోనే అందజేస్తాం. – ఎంఏ రహీం, అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్, కంగ్టి

ఏకాగ్రతతో నడిపితే ప్రమాదాలు దూరం

ఎంవీఐ జయప్రకాశ్‌రెడ్డి

జహీరాబాద్: డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడిపితే ప్రమాదాలు నివారించవచ్చని ఎంవీఐ జయప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్ డిపోలో డీఎం జీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో డ్రైవర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, ఎదుటి వారి వల్ల కూడా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. 25 సంవత్సరాలుగా ఎలాంటి ప్రమాదం లేకుండా బస్సులను నడిపిన డ్రైవర్లు నర్సింహులు, వినోదయ్య, అహ్మద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది ప్రవీణ్‌కుమార్, తిరుమలేశ్, శ్రీనివాస్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా డ్రైవర్స్ డే

నారాయణఖేడ్: స్థానిక ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో డ్రైవర్స్ డే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. డిపో మేనేజర్ మల్లేశయ్య బుధవారం ఆర్టీసీ డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్లు నిబంధనలకు అనుగుణంగా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. మద్యం సేవించడం, ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ పీఆర్వో పాండు తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్‌ను సత్కరిస్తున్న జయప్రకాశ్‌రెడ్డి

పేకాట స్థావరంపై దాడి

- రూ.23,640 నగదు పట్టివేత

కంగ్టి(నారాయణఖేడ్): పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురిని పట్టుకున్నామని ఎస్ఐ విశ్వజన్ తెలిపారు. గ్రామంలోని పోచమ్మ గల్లీలో కొందరు పేకాడుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేయగా జాదవ్ కిరణ్, ఎడురే నగేశ్, జాదవ్ రమేశ్, మొహమ్మద్ పాషా, ఉడుత శంకర్, భూరే పండరి, తోంట అశోక్ పట్టుబడ్డారని, వారి వద్ద నుంచి రూ.23,640 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

గుండె పోటుతో వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సంగారెడ్డి టౌన్: గుర్తు తెలియని వ్యక్తి గుండె పోటుతో మృతి చెందిన ఘటన రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో భిక్షాటన చేస్తూ జీవనం సాగించే గుర్తు తెలియని వ్యక్తి బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని. సమాచారం తెలిసిన వారు 712656719, 8712656746 నెంబర్లలలో సంప్రదించాలన్నారు.

హిందువుల జోలికొస్తే ఖబడ్దార్..




ర్యాలీలో పాల్గొన్న మురళీధర్ యాదవ్ తదితరులు

బీజేపీ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు మురళీధర్

హత్నూర(సంగారెడ్డి): హిందువుల జోలికొస్తే ఖబడ్దార్ అంటూ బీజేపీ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు మురళీధర్ యాదవ్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం హత్నూర మండలం దౌల్తాబాద్ చౌరస్తాలో శ్రీరామ భక్తులు చేపట్టిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరామచంద్రుడు విగ్రప్రతిష్ఠ సందర్భంగా దౌల్తాబాద్లో పల్లకీసేవ చేపడితే ఓ వ్యక్తి కాలి బూటు వేయడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. శాంతియుతంగా నిరసన తెలిపితే పోలీసులు కొంతమంది భక్తులను అదుపులోకి తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు బిట్ల మహేశ్ నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. రాస్తారోకో వల్ల వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న జిన్నారం సీఐ వేణు కుమార్, ఎస్ఐ సుభాస్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని రాస్తారోకోను విరమింపజేశారు.

కోడిగుడ్డే..



సాధారణం కంటే చిన్నసైజులో ఉన్న ఓ కోడిగుడ్డు అందరినీ ఆశ్చర్యపరిచింది. బుధవారం హత్నూర గ్రామానికి చెందిన సత్యగౌడ్ ఇంట్లోని ఓ కోడి సాధారణ గుడ్డు కన్నా చిన్న సైజులో గుడ్డు పెట్టింది. అతి చిన్న కోడిగుడ్డును చూసినవారు ఆశ్చర్యానికి లోనయ్యారు.

హత్నూర(సంగారెడ్డి):

పశువుల ఆరోగ్య భద్రతపై దృష్టి అవసరం

రాయికోడ్(అందోల్): పశువుల ఆరోగ్య భద్రతపై దృష్టి సారించాలని మండల పశువైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పాంపాడ్ గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పలు పశువులను పరీక్షించి పోషకులకు పలు సూచనలు చేశారు. అవసరమైన మందులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని, నాటువైద్యం జోలికి వెళ్లొద్దని కోరారు. నాయకులు కాశీనాథ్ పాటిల్, సిబ్బంది కృష్ణ, బాబయ్య, బసంతి పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ముబారక్ పూర్(బి) గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి సంతోష్ కుమార్ పశువులను పరీక్షించారు. అనంతరం మాట్లాడుతూ గేదెల కృత్రిమ గర్భధారణకు గోపాలమిత్రులు ఇంటి వద్దకే వచ్చి ఇంజెక్షన్‌లు ఇస్తారని తెలిపారు.



గేదెకు టీకా చేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ ఉత్సాహంగా ఆటల పోటీలు

జహీరాబాద్ టౌన్: స్థానిక శ్రీనారాయణ హైస్కూల్‌లో బుధవారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. చైర్మన్ శ్రీశైలం క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. రన్నింగ్, ఖోఖో, స్కిప్పింగ్, కబడ్డీ, వాలీబాల్, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

◆ నేటి నుంచి 101 దేవుళ్ల జాతర

రాయికోడ్(అందోల్): మండలంలోని కర్చల్ గ్రామంలో గురువారం నుంచి శానురే ఇమామ్–సయ్యద్ యాదుల్లా హుస్సేనీ 101 దేవుళ్ల ఉర్సు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం నుంచి 28 వరకు వివిధ కార్యక్రమాలు, 29న కుస్తీ పోటీలు నిర్వహించి విజేతలకు వెండి కడియాలను బహుమతిగా అందజేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

◆ బీజేపీ ప్రధాన కార్యదర్శిల నియామకం

సంగారెడ్డి: బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా జిల్లా ప్రధాన కార్యదర్శిలను నియమించినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అందోల్ నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శిగా అనంతరావు కులకర్ణి, సంగారెడ్డి నియోజకవర్గానికి ఓదేలా మాణిక్‌రావు, పటన్‌చెరువు నియోజకవర్గానికి కొలుకూరి రాజశేఖర్‌రెడ్డిని నియమించినట్లు ఆమె వెల్లడించారు.

◆ కరసేవకులకు సన్మానం

జహీరాబాద్ టౌన్: పస్తాపూర్ శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం కరసేవకులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. 1992లో విశ్వహిందూ పరిషత్ దాని అనుబంధ సంస్థలకు చెందిన సుమారు 100 మందికిపైగా కరసేవకులు నియోజకవర్గం నుంచి తరలివెళ్లారు. అయోధ్య శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా సుమారు 15 మంది కరసేవకులను సన్మానించారు.

◆ నేడు బాల రాముని విజయ శోభాయాత్ర

నారాయణఖేడ్: అయోధ్యలోని బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరై కొండపూర్ ఆశ్రమ పీఠాధిపతి, అఖిల భారత విశ్వహిందూ పరిషత్ సాధుసంతు సభ్యుడు సంగ్రాం మహరాజ్ 25న ఖేడ్‌కు చేరుకుంటున్న సందర్భంగా మంగల్‌పేట్ దుర్గాభవాని మందిరం నుంచి శోభాయాత్ర నిర్వహించనున్నట్టు మలమంచి గురురాజ్ శర్మ బుధవారం తెలిపారు.

◆ స్పెషల్ డ్రైవ్..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం సాయంత్రం స్మైల్ బృందం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. బహుళ అంతస్తుల భవన నిర్మాణంలో పనిచేస్తున్న ముగ్గురు బాల కార్మికులను గుర్తించారు. బాల కార్మికులతో పని చేపిస్తున్న సంస్థలపై జేజే చట్టం కింద పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ యువతి అదృశ్యం



ప్రమీల(ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ యువతి అదృశ్యమైన ఘటన స్థానిక శ్రీనివాస్ నగర్ కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. కాలనీలో నివాసముండే ప్రమీల శేరిలింగంపల్లిలోని చందానగర్ ప్రాంతంలో హౌస్ కీపింగ్ పనిచేస్తుంది. ఎప్పటిలాగానే ఈ నెల 17 ఉదయం విధులకని చెప్పి వెళ్ళింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పనిచేసే చోట ఆరా తీశారు. పనికి రాలేదని తెలియడంతో స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ పేదలకు సేవ చేయడమే లక్ష్యం

హత్నూర(సంగారెడ్డి): పేదలు, విద్యార్థులకు సేవలు అందించడమే లక్ష్యమని రోటరీ క్లబ్ మంజీరా జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి అన్నారు. బుధవారం సికిందలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని మెగా వైద్యశిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ రెడ్ క్రాస్ సొసైటీ, సాయిరాం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ రాజుగౌడ్ గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది పలువురికి పరీక్షలు జరిపి మందులను అందజేశారు.

ఘనంగా మోతిమాత జాతర ప్రారంభం

- మొదటి రోజు నైవేద్యాల సమర్పణ
- నేడు మంత్రి దామోదర రాక

జహీరాబాద్: మినీ మేడారంగా పేరొందిన ఉప్పర్‌పల్లి తండాలో మోతిమాత ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం మొదటి రోజు ఉత్సవాలు జెండా ఆవిష్కరణ, అభిషేకం కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పూజారి అమ్మవారికి ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి గిరిజనులు కలశాలు, భక్షాలతో తరలివచ్చి మోతిమాతకు నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. అనంతరం జరిగిన పల్లకీసేవలో గిరిజనులు ఉత్సాహంగా పాల్గొని సాంప్రదాయ నృత్యంతో సందడి చేశారు. గురువారం ఉత్సవాల్లో పాల్గొనేందుకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రానున్నందున అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ మండల నాయకులు మక్సూద్, హర్షద్ పటేల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.



నైవేద్యాలు, కలశాలతో తరలివచ్చిన గిరిజనులు

సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప తెలిపారు. బుధవారం నిర్వహించిన సాయినగర్ కాలనీ బస్తీ దర్శన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలోని ప్రధాన సమస్యలను పరిష్కరించామన్నారు. సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని, సమస్యలను తెలుసుకొని వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పూర్తిస్థాయిలో పరిష్కరిస్తున్నామని చెప్పారు. కాలనీవాసులు తెలిపిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు లక్ష్మణ్, యాదిరెడ్డి, జగన్ గౌడ్, వెంకటేశ్వర్లు, కృష్ణ కుమార్, విష్ణు, ప్రీతిగౌడ్, అర్చన, విశాలి పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్ప

కాలనీల అభివృద్ధికి చర్యలు

మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి

జిన్నారం: మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతున్నట్టు బొల్లారం మున్సిపల్‌చైర్ పర్సన్ రోజారాణి తెలిపారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోగల ఎనిమిదో వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆమె కమిషనర్ సంగారెడ్డితో కలిసి పరిశీలించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోజారాణి మాట్లాడుతూ బొల్లారం మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేలా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.



కాలనీలోని సమస్యలను తెలుసుకుంటున్న రోజారాణి

సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

జహీరాబాద్ టౌన్: కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న వివిధ సంఘాలు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు పిలుపు నిచ్చారు. పట్టణంలోని శ్రామిక్ భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల నుంచి కార్మిక, రైతుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. కేంద్రం కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయకుండా లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని ధ్వజమెత్తారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ బీబీపాటిల్‌కు స్కీం వర్కర్లు బహిరంగ లేఖ రాశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్, వివిధ రంగాల, పరిశ్రమల నాయకులు నందమ్మ, నాగమణి, నర్సయ్య, నరేశ్, సువర్ణమ్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

హార్మోన్ల అసమతుల్యతే అనారోగ్యానికి కారణం

డాక్టర్ ప్రదీప్

పటాన్‌చెరు టౌన్: హార్మోన్ల అసమతుల్యత వల్లే అనారోగ్యానికి గురవుతున్నారని డాక్టర్ ప్రదీప్‌రెడ్డి అన్నారు. 'జాతీయ బాలికా దినోత్సవం' సందర్భంగా గీతంలో బుధవారం 'బియాండ్ ద ఎక్రోనిమ్స్: పీసీవోడీ–పీసీవోఎస్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్(పీసీవోఎస్) ద్వారా ప్రభావితమైమెన వారిలో పురుష హార్మోన్లు అధికంగా ఉత్పత్తి అవుతున్నాయని, దీని వల్ల ఋతుక్రమం తప్పడం, బరువు పెరగడం వంటి సమస్యలకు దారితీస్తున్నట్టు వెల్లడించారు. మహిళల్లో పాలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్, సింట్రోమ్‌ల వ్యాప్తి, ప్రభావం గురించి అవగాహన కల్పించారు.



ప్రదీప్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న విద్యార్థులు

పత్తి రైతుకు కూలీల భారం

- అందని గిట్టుబాటుధర
- కూలీల డిమాండ్‌తో అయోమయ స్థితి

మునిపల్లి(అందోల్): కూలీలకు డిమాండ్ బాగా పెరగడంతోపాటు వివిధ సమస్యలతో పత్తిరైతు బతుకు భారంగా మారింది. మూడో తెంపు పత్తి తీయడానికి కిలోకు సుమారు రూ.30 నుంచి 35 కూలీలకు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి తెంపడానికి గ్రామాల్లో కూలీలు దొరకకపోవడంతో ఇతర గ్రామాల నుంచి వలస వచ్చిన కూలీలతో రైతులు పనులు చేయించుకుంటున్నారు. పత్తి కిలోకు రూ.6వేలు చొప్పున వ్యాపారులు కొనుగోలు చేయడంతో అందులో సగం కూలీలకే పోతోందని రైతులు వాపోతున్నారు. పత్తి పంటకు గిట్టుబాటుధర లేకపోవడం, కూలీల డిమాండ్‌తో రైతులు అయోమయంలో పడ్డారు.



పిల్లోడి గ్రామ శివారులో పత్తి పంట